ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
గురువారం 15 ఆగస్టు 2024 | 7



ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో 150 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు

జిల్లాలో 78వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హర్‌ఘర్ తిరంగాలో భాగంగా పాఠశాల విద్యార్థులు ఆయా ప్రాంతాల్లో పొడవైన జాతీయ జెండాలతో భారీ ప్రదర్శనలు నిర్వహించారు. తద్వారా ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపారు. కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య వేడుకలు నేడు ఘనంగా జరగనున్నాయి.



పిఠాపురం పట్టణం ఉప్పాడ సెంటర్‌లో 100 అడుగుల జాతీయ జెండాతో నిర్మించిన మానవహారం



సామర్లకోటలో 300 అడుగుల జాతీయ పతాకంతో అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

- నేడు కాకినాడ పోలీస్ పెరేడ్ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- జాతీయ పతాక ఆవిష్కరణ చేయనున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 14: 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కాకినాడ పోలీసు పెరేడ్ మైదానంలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ విశిష్టత ఉట్టిపడేలా జెండాలతో అలంకరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విచ్చేస్తున్నారు. గురువారం ఉదయం 9గంటలకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జాతీయ పతాక ఆవిష్కరణ నిర్వహించనున్నారు. ఉదయం 9.05గంటలకు ఆయన పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. ఉదయం 9.15గంటలకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ సందేశం ఇస్తారు. 9.30 గంటలకు పోలీసు కవాతు జరగనుండగా 10గంటలకు ప్రగతి శకటాల ప్రదర్శన, 10.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 11 గంటలకు ప్రశంసాపత్రాలు(అవార్డుల) ప్రదానం చేస్తారు. 12 గంటలకు డిప్యూటీ సీఎం కాకినాడనుంచి బయలుదేరి విజయవాడకు వెళ్తారు.

ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు

కాకినాడలోని పోలీసు పెరేడ్ మైదానంలో కార్యక్రమానికి విచ్చేసిన ప్రజాప్రతినిధులకు ప్రత్యేకంగా గ్యాలరీ ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబీకులు కూర్చోవడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. జిల్లా అధికారులు, మీడియా ప్రతినిధులు, ప్రజలు కూర్చోవడానికి విడివిడిగా గ్యాలరీలు ఉన్నాయి. శకటాలు ఒక క్రమ పద్ధతిలో వచ్చేలా ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారు. స్వాతంత్ర్య వేడుకలను విజయవంతంగా నిర్వహించడానికి కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నారు.

200మంది ఉద్యోగులకు అవార్డులు

జిల్లాలో గత సంవత్సర కాలంలో అత్యుత్తమ ప్రతిభతో విధులు నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగులు 200మందికి అవార్డుల ప్రదానం జరగనుంది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీరికి అవార్డులు అందించి సత్కరిస్తారు. దీనిలో జిల్లాస్థాయి అధికారులు, మండలస్థాయి అధికారులు, పోలీసు అధికారులు, వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, సాంఘిక సంక్షేమశాఖ, పంచాయతీ శాఖ, గ్రామీణ నీటిపారుదలశాఖ, రెవెన్యూ ఉద్యోగులు ఉన్నారు.



కాకినాడ పరేడ్ గ్రౌండ్‌లో వేదికపై ఏర్పాట్లు

రిహార్సల్స్ చేస్తున్న వివిధ శాఖల అధికారులు

పటిష్ట భద్రత

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు పటిష్ఠ భద్రత ఉంది. ఈ నేపథ్యంలో కాకినాడ పోలీసు పెరేడ్ మైదానంలో విస్తృత తనిఖీలు చేశారు. బాంబ్ స్క్వాడ్‌తోపాటు ఇతర పోలీసు బృందాలు తనిఖీలు చేశాయి. ప్రవేశ ద్వారంవద్ద తనిఖీ చేసి పెరేడ్ మైదానంలోకి పంపేలా పోలీసులు ఏర్పాట్లు చేశారు.



కాకినాడలో డిప్యూటీ సీఎం పవన్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

కాకినాడ జేఎన్‌టీయూకు చేరుకున్న డిప్యూటీ సీఎం

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 14: మంగళగిరి నుంచి బయలుదేరిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గన్నవరం ఎయిర్‌పోర్ట్‌నుంచి రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు బుధవారం రాత్రి 9 గంటలకు చేరుకున్నారు. అక్కడినుంచి కాకినాడ జేఎన్‌టీయూ అతిథిగృహానికి రాత్రి 10.30గంటలకు చేరుకున్నారు. గురువారం ఉదయం 9గంటలకు కాకినాడ పోలీసు పెరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొంటారు. ఆయన వెంట కుమార్తె ఆద్య కూడా ఉన్నారు.



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న పవన్‌కల్యాణ్

వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ, కలెక్టర్



పోలీసు పెరేడ్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 14: కాకినాడ పోలీసు పెరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ బుధవారం పరిశీలించారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న నేపథ్యంలో రంగరాయ వైద్యకళాశాలలో హెలీప్యాడ్‌ను, ఆయన బసచేయనున్న జేఎన్‌టీయూకే అతిథిగృహాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలు, కార్యాలయాలు, ముఖ్య కూడలిలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటివద్ద జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. డిప్యూటీ సీఎం రాకతో పటిష్ఠ భద్రత పెట్టామన్నారు. ఎండవేడిమి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేశామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ప్రాథమిక వైద్యం అందించే లక్ష్యంతో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ స్టాల్ ఏర్పాటు చేశామన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా శకటాలు తయారు చేశామన్నారు. పరిశీలనలో పాల్గొన్న కాకినాడ ఆర్డీవో కిషోర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, డీఎంహెచ్‌వో నరసింహనాయక్, డీఎస్పీ హనుమంతురావు పాల్గొన్నారు.

విద్యుత్ దీపకాంతులతో ప్రభుత్వ కార్యాలయాలు ధగధగ

స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని కాకినాడ నగరం ముస్తాబయింది. కాకినాడ నగరంలో కలెక్టరేట్ భవనంతోపాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ దీపకాంతులతో ధగధగలాడుతున్నాయి. కాకినాడ కలెక్టరేట్‌లో కార్యాలయాన్ని త్రివర్ణపతాకం రంగులతో విద్యుత్తు దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. గాంధీ విగ్రహం చుట్టూ విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి.



విద్యుత్ దీపకాంతులతో ధగధగలాడుతున్న కాకినాడ కలెక్టరేట్ భవనం

ఒకమ్మాయితో నిశ్చితార్థం.. మరొకరితో పెళ్లికి సిద్ధం

- కట్నం ఆశతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్బుద్ధి
- కాజులూరు మండలం గొల్లపాలెంలో బయటపడిన పెళ్లికొడుకు నిర్వాకం
- బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు

కరప, ఆగస్టు 14: కట్నం ఆశతో ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నిశ్చితార్థం చేసుకున్న యువతికి అన్యాయం చేస్తూ మరో యువతిని పెళ్లి చేసుకునేందుకు సిద్ధపడ్డాడు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని, లేకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఆరోపిస్తూ బాధిత యువతి కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. దీనికి సంబంధించి బాధితులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వడ్డి మణికంఠశరణ్‌కు అదే గ్రామానికి చెందిన ఓ యువతితో 2023లో పెద్దల సమక్షంలో నిశ్చితార్థం జరిగింది. కాలక్రమంలో పెళ్లి మాట ఎత్తేసరికి పెళ్లి కుమారుడు, అతడి కుటుంబసభ్యులు వాయిదాలు వేస్తూ కాలయాపన చేయసాగారు. కాగా, కట్నం ఎక్కువ వస్తుందనే ఆశతో మణికంఠశరణ్ పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన మరో అమ్మాయితో పెళ్లికి సిద్ధమయ్యాడు. ఈనెల 18న వివాహం చేయడానికి కుటుంబసభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న నిశ్చితార్థం చేసుకున్న యువతి కుటుంబసభ్యులు పెళ్లికుమారుడి ఇంటికి వెళ్లి నిలదీశారు. పెళ్లికుమారుడు, వారి తల్లిదండ్రులు దురుసుగా సమాధానమివ్వడంతో యువతి బంధువులు గొల్లపాలెం పోలీసులను ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. వారు అడిగిన కట్నకానుకలు ఇచ్చి ఎంతో ఆర్భాటంగా తమ కుమార్తె నిశ్చితార్థం జరిపామని, ఇప్పుడు తమకు ఆత్మహత్య తప్ప మరో దారి లేదంటూ యువతి తల్లి ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి మోసగాళ్లను కఠినంగా శిక్షించాలని పెండ్లి కుమార్తె కుటుంబసభ్యులు కోరుతున్నారు. దీనిపై బాధిత యువతి తల్లి ఫిర్యాదు మేరకు గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

29న స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులు ఇవ్వాలి: డీఈవో

కాకినాడ రూరల్, ఆగస్టు 14: జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 29న స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు నిర్వహించాలని డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. ఈ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకునే పాఠశాలలకోసం సంబంధిత ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు స్పోర్ట్స్, గేమ్స్ సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలపై కౌంటర్ సైన్ చేయాలన్నారు. సంబంధిత గేమ్స్‌లో పొందిన స్కోర్ పరిగణనలోనికి తీసుకుంటామని తెలిపారు. ఈనెల 16లోపు దరఖాస్తు చేసుకోవాలని 21న క్రీడా ప్రతిభా అవార్డుల దరఖాస్తులను ఖరారు చేయనున్నామన్నారు. ఈ అవార్డులకు జిల్లాలోని ఐదు పాఠశాలలను ఎంపిక చేయనున్నట్లు డీఈవో తెలిపారు. వివరాలకు కాకినాడ డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆక్రమణలను ఉపేక్షించం: కాకినాడ కమిషనర్ భావన

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 14: రహదారుల ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించబోమని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన హెచ్చరించారు. కాకినాడ-సామర్లకోట కెనాల్ రోడ్డు సుందరీకరణ, కాలువ వెంబడి ఏర్పాటు చేయనున్న ఫెన్సింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించిన కమిషనర్ బుధవారం మరోసారి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ప్రతాప్ నగర్ సమీపంలో రహదారి పక్కన ఏర్పాటు చేసిన బడ్డీలను, ఇతరత్రా ఆక్రమణలను తొలగింపజేశారు. కెనాల్ రోడ్డు పక్కన కొబ్బరి బొండాలు, చెత్త డంపింగ్ చేయకుండా చూడాలన్నారు.



తుని మండలం గండివద్ద గ్రావెల్, మట్టి తరలించుకుపోవడంతో కళాహీనంగా దర్శనమిస్తున్న రెవెన్యూ కొండ ప్రాంతం

కొండలు విధ్వంసం

- భూమి చదును పేరుతో కొండలు ధ్వంసం
- కన్నెత్తి చూడని అధికారులు
- కళతప్పుతున్న తూర్పు కనుమలు

తుని రూరల్, ఆగస్టు 14: పచ్చదనం పరుచుకుని ప్రకృతి అందాలతో ఊటీని తలపించే మెట్టప్రాంతంలోని తూర్పు కనుమలు కళతప్పుతున్నాయి. పోడుభూముల ముసుగులో పచ్చని చెట్లపై గొడ్డలి వేటు వేస్తున్నారు. కొండలను పాడు చేయకుండా వాటిలో ఫలసాయం అందించే మొక్కలు వేసుకుని జీవనోపాధి పొందడానికి భూమి లేని రైతు కూలీలకు ప్రభుత్వం అనుమతిచ్చి అవసరమైన చోట డీ-ఫారం పట్టాలు అందజేస్తుంది. ఈ తరహా పట్టా భూములు కొందరు భూస్వాముల చేతుల్లోకి వెళ్లడంతో వారి భూదాహానికి కొండలు ధ్వంసమవుతున్నాయి. తుని మండలం అటికివానిపాలెం సమీపంలో ఒక రైతు 200 మీటర్ల కొండపైకి ఎక్స్‌కవేటర్‌ను ఎక్కించి భూమి చదును పేరుతో యథేచ్ఛగా ధ్వంసం చేస్తున్నా రెవెన్యూ సిబ్బంది ఆ వైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత పాలకుల ధన దాహంతో తుని మండలంలోని డి.పోలవరం, తేటగుంట, హంసవరంల్లో కొండలను గుల్లచేసి గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలించేశారు. అధికారులు దృష్టిసారించి కొండల్ని సంరక్షించాలని పలువురు కోరుతున్నారు.

సీఐ దాసరి గంగరాజుకు రాష్ట్రపతి అవార్డు



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 14: తిరుపతి జిల్లా వెంకటగిరి ఏపీఎస్పీ బెటాలియన్‌లో రిజర్వు సీఐగా పనిచేస్తున్న దాసరి గంగరాజు రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఈ ఏడాది విజయవాడలో ఐజీగా పనిచేస్తున్న రవిప్రకాష్, గంగరాజులను మాత్రమే ప్రభుత్వం ఎంపిక చేసింది. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట మండలం పెద్దబ్రహ్మదేవం గ్రామానికి చెందిన గంగరాజు 1998లో రిజర్వు ఎస్ఐగా పోలీసుశాఖలో చేరారు. ఏపీ పోలీసు అకాడమీలో పనిచేశాక టీటీడీకి బదిలీపై వచ్చి ఐదేళ్ల పాటు ఏవీఎస్వోగా పనిచేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో వెంకటగిరి ఏపీఎస్పీ బెటాలియన్‌కు బదిలీ అయ్యారు. అవార్డు ప్రకటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో ఇండియన్ పోలీసు మెడల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునుంచి అందుకున్నానని చెప్పారు. రాష్ట్రపతి అవార్డు రావడంపట్ల చాలా సంతోషంగా ఉందని చెప్పారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 14: పీఎంకేవీవై 4.0 పథకంలో భాగంగా కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ కాకినాడ ప్రిన్సిపాల్ ఎంవీజీ వర్మ తెలిపారు. ఎలక్ట్రికల్ టెక్నీషియన్, అసిస్టెంట్ ఇన్‌స్టాలేషన్ కంప్యూటింగ్ పెరిఫెరల్స్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. 45ఏళ్ల లోపు అభ్యర్థులు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయంలో ఈనెల 19 లోపు దరఖాస్తు చేయాలన్నారు.

పాల కేంద్రంపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 14: కాకినాడ అచ్యుతాపురం రైల్వే గేటు సమీపంలో ఒక పాల కేంద్రంపై ఆహార భద్రత నియంత్రణ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. పాలకేంద్రంలో మిల్క్ పౌడర్ ఉపయోగించి పాలు తయారు చేయడం, వాటిలో పాల ప్యాకెట్లు పాలు కూడా వాడడం, వాటినుంచి మీగడ తీయడం నెయ్యి తయారు చేయడం వంటి అక్రమ వ్యాపారాలకు పాల్పడడం అధికారులు గుర్తించారు. తయారీ కేంద్రం వద్ద పరిసరాలు శుభ్రంగా లేవని అనారోగ్య కారణాలకు దారితీసే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆహార భద్రత నియంత్రణ అధికారి బి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి అనుమతులు లేకుండా పాల కేంద్రం నిర్వహించడంతోపాటు ఎటువంటి శుభ్రత లేకుండా పరిసరాలు అధ్వానంగా ఉన్నాయన్నారు. పాల కేంద్రం పేరు చెప్పి పాల పౌడర్, ఇతర కంపెనీల పాలు ప్యాకెట్లు ఉపయోగించి వాటిలోని వెన్న శాతాన్ని పూర్తిగా తీసివేసి నెయ్యి తయారు చేస్తూ పలు రకాల వ్యాపారాలు అక్రమంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పాల పౌడర్, ప్యాకెట్ పాలు, పెరుగు, నెయ్యి శాంపిల్స్ తీసుకుని వెళ్తున్నామని, వీటిని ల్యాబ్‌కి పరీక్షలు నిమిత్తం పంపించిన తర్వాత తగిన చర్యలు చేపడతామని ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ నగరపాలక సంస్థ ఆరోగ్య విభాగం హెల్త్ ఆఫీసర్‌కి సమాచారం అందించడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవివర్మ, మేస్త్రీ అబ్బులు సంఘటనా స్థలానికి చేరుకుని పాలకేంద్రాన్ని సీజ్ చేశారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఇతర అధికారులు ఉన్నారు.



పాల కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఆహార భద్రత నియంత్రణ అధికారులు



సామర్లకోటలో మువ్వన్నెల జెండాలతో బాలుడు



కాకినాడ కలెక్టరేట్‌లో విద్యుద్దీపాలంకరణలో గాంధీజీ విగ్రహం

మొక్కలతో ఆకట్టుకుంటున్న

స్వాతంత్ర్య దినోత్సవం కూర్పు

● గ్లోరీ ఇండియా పేరుతో శుభాకాంక్షలు

కడియం ఆగస్టు 14 : కడియం పల్ల వెంకన్న నర్సరీలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నర్సరీ రైతులు మొక్కలతో గ్లోరీ ఇండియా పేరుతో శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీయేట వినూత్నంగా మొక్కలతో ఇక్కడ శుభాకాంక్షలు తెలుపుతారు. ఇందులో భాగంగా బుధవారం నర్సరీలో వినూత్నంగా మొక్కలతో అలంకరించి దేశాభిమానాన్ని చాటుకున్నారు.



స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ మొక్కలతో నర్సరీ రైతులు ఏర్పాటు చేసిన కూర్పు

పెద్దాపురంలో మహాత్ముడి తీపిగుర్తులు



మహాత్మాగాంధీ ఒక రోజు బస చేసిన ముప్పనవారి బంగ్లా

పెద్దాపురం, ఆగస్టు 14: పెద్దాపురంలో జాతిపిత మహాత్మాగాంధీ తీపిగుర్తులు ఉన్నాయి. మహాత్ముడు పట్టణంలో రెండు ప్రాంతాలను సందర్శించినట్లు పలువురు చెబుతున్నారు. దీంట్లో పట్టణంలో ఉన్న మెయిన్‌రోడ్డు కాగా, రెండవది ముప్పనవారి బంగ్లా అని చెప్పవచ్చు. 1942లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహాసభలకు ఆయన వచ్చినప్పుడు పెద్దాపురం పట్టణాన్ని మహాత్ముడు సందర్శించారు. డైలీమార్కెట్, మెయిన్‌రోడ్డు మధ్యలో ఉన్న సెంటర్‌లో ఆయన కాంగ్రెస్ నాయకులనుద్దేశించి ప్రసంగం చేశారు. అప్పటినుంచి ఆసెంటర్‌ను గాంధీ బొమ్మ సెంటర్ అని పిలుస్తారు. అలాగే మహాసభ ముగిసిన అనంతరం ఆయన ముప్పన వారి బంగ్లాలో ఆరోజు రాత్రి బసచేశారని పెద్దలు చెబుతున్నారు.

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తికి ఊతమిచ్చిన దేవులపల్లి గేయం



దేవులపల్లి కృష్ణ శాస్త్రి

సామర్లకోట, ఆగస్టు14: స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తికి నాడు దేశవ్యాప్తంగా ఎంతో ఊతమిచ్చిన గేయం దేవులపల్లి కృష్ణశాస్త్రి రచించిన జయజయ ప్రియ భారత జనయిత్రి దివ్యధాత్రి నేటి తరానికి కూడా ఎంతో స్ఫూర్తిదాయకం కావడం విశేషం. ఈగేయ రచయిత దేవులపల్లిది ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి తూర్పుగోదా వరిజిల్లా సామర్లకోట మండలం రావువారి చంద్రంపాలెం కావడంతో ఈ ప్రాంతానికి ఎంతో ప్రాధాన్యం సంతరించుకోవడం విశేషం. దేవులపల్లి కృష్ణశాస్త్రి జన్మస్థలం కాకినాడజిల్లా సామర్లకోట మండలం రావువారి చంద్రంపాలెం కాగా, కాకినాడ పీఆర్ కళాశాలలో ఉన్నత విద్యాభ్యాసంచేసి తొలిసారిగా పెద్దాపురం లూథరన్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా 1919లో చేరారు. 1945లో సినీరంగంలో ప్రవేశించిన దేవులపల్లి స్వాతంత్ర్య పోరాటయోధులను మరింత ఉత్తేజితులను చేసేందుకు గానూ జయజయ ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి అనే గేయం రచించగా అప్పట్లోనే ఈ గేయం ఎంతో పాపులా రిటీ సాధించింది. 1986లో చిరంజీవి నటించిన రాక్షసుడు సినిమాలో ఇదే గేయాన్ని తిరిగి తెరకెక్కించడం ద్వారా దేవులపల్లి గేయం మరోసారి ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం ఏర్పరుచుకుంది..



కపిలేశ్వరపురం: అంగరలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం ఆకారంలో ఏర్పడిన విద్యార్థులు



దివాన్ చెరువు: నామవరంలో భారతదేశం ఆకృతిలో నిల్చున్న ఓ పాఠశాల విద్యార్థులు

వాడపల్లిలో స్వరాజ్య స్ఫూర్తి



వాడపల్లిలో స్వాతంత్ర్య పోరాటయోధుల స్థూపం

ఆత్రేయపురం, ఆగస్టు 14: దైవభక్తి, దేశభక్తి చాటిన నేలగా వాడపల్లి వాడని మల్లెగా విరజిల్లుతోంది. 1931 మార్చి 30 ఏకాదశి రోజున శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం, రథోత్సవం నిర్వహిస్తున్నారు. రథంపై బాపూజీ చిత్రపటాన్ని, స్వరాజ్య జెండాను దేశభక్తులు ఎగురవేశారు. బ్రిటీష్ డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్ ముస్తాఫ్ ఆలీఖాన్ రథోత్సవం వద్దకు వచ్చి గాంధీ చిత్రపటాన్ని, మువ్వన్నెల జెండాను తొలగించాలని ఆదేశించారు. దేశభక్తులు ససేమిరా అనడంతో లాఠీ చార్జ్‌చేసి తుపాకీ కాల్పులు జరిపారు. నలుగురు పోరాటయోధులు అమరులయ్యారు. వందలాది మంది గాయపడగా మరికొంత మందిని జైళ్లలో బంధించారు. నాటి పోరాటంలో దేశభక్తులు కోపోద్రిక్తులై బ్రిటీష్ పాలకులపై తిరగపడగా పలాయనం చిత్తగించారు. దేశభక్తితో పాటు దైవభక్తిగా చాటుకున్న నేలగా వాడపల్లి చరిత్రకెక్కింది. ఈ పోరాట స్ఫూర్తి భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలనే మంచి ఉద్దేశంతో రాజకీయ దురంధరుడు, గాంధేయవాది, మాజీ ఎమ్మెల్యే మంతెన వెంకట సూర్యసుబ్బరాజు వాడపల్లి క్షేత్రం ఎదురుగా స్మారక స్థూపాన్ని నిర్మించారు. స్వామివారి కల్యాణం, రథోత్సవం తిలకించ డానికి వచ్చే లక్షలాది మంది భక్తులు అమరులకు నివాళులర్పిస్తూ చరిత్ర తెలుసుకుంటున్నారు. స్వా తంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేసేందుకు ఈ స్థూపాన్ని ముస్తాబు చేస్తున్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ర్యాలి గ్రామం ఎంతో ప్రత్యేకత చాటుకుంది. 1929లో విదేశీ వస్తు బహిష్క రణపై పోరాటం సాగిస్తున్నారు. అందులో భాగంగా గాంధీజీ ర్యాలి గ్రామాన్ని సందర్శించారు. వేల సంఖ్యలో దేశభక్తులు బాపూజీ వెంట నడిచారు. గాంధీ ర్యాలి వచ్చిన సందర్భంగా 1953లో జగన్మోహినీ కేశవస్వామి గుడి వీధిలో దివంగత పి.సురపరాజు గాంధీ విగ్రహాన్ని నెలకొల్పారు.



ర్యాలి గాంధీ వచ్చిన సందర్భంగా నిర్మించిన మహాత్ముని విగ్రహం



ఎటపాకలో 212 బెటాలియన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

212 బెటాలియన్ ఆధ్వర్యంలో ర్యాలీ

ఎటపాక, ఆగస్టు 14: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎటపాకలో 212 బెటాలియన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలతో సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఎటపాక సీఆర్‌పీఎఫ్ క్యాంపు నుంచి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ప్రభాత్ భేరీ నిర్వహించారు. జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కమాండెంట్ దిపక్ కుమార్ పాల్గొన్నారు.



ఆలయంలో ఏర్పాటుచేసిన ఫొటో షూట్, ఆలయ ముఖ మండపంలో ఫల, పుష్పాలతో అలంకరణ

వైభవంగా వాడపల్లి వెంకన్న పవిత్రోత్సవాలు

● ఫల, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ
● ఆగమ శాస్త్రం ప్రకారం ప్రత్యేక పూజలు
● గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయం

ఆత్రేయపురం, ఆగస్టు 14:వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు పవిత్రోత్సవాలను మేళతాళ మంగళవాయిద్యాలు, వేదమంత్రాల సాక్షిగా తీసుకొచ్చారు. వివిధ రాష్ట్రాలకు చెందిన నిపుణుల ఆధ్వర్యంలో ఫల, పుష్ప అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. వసంత మండపంలో కొలువుదీరిన ఉత్సవమూర్తులకు తొలిరోజును విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరుణ, దీక్షాధారణ, అకల్మష హోమం, సాయంత్రం అంకురార్పణ, వాస్తు పూజ, అగ్నిమథనం, ప్రతిష్ఠాపన, వాస్తుహోమాలను వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ పవిత్రోత్సవాల్లో పాల్గొన్నారు. వివిధ రకాల పుష్పాలతో నెమలి అలంకరణలో ఫొటో షూట్‌వద్ద భక్తులు సందడి చేశారు.



స్వామివారి పవిత్రోత్సవాల్లో ఉప కమిషనరు పూజలు

వేర్వేరు కేసుల్లో 104 కేజీల గంజాయి స్వాధీనం

● ఐదుగురు నిందితుల అరెస్టు

చింతూరు, ఆగస్టు 14: రెండు వేర్వేరు కేసుల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు, మోతుగూడెం పోలీసులు 104 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో ఐదుగురు నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపించారు. చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా ఈమేరకు బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. అల్లూరి సీతారామరాజుజిల్లా జీకే వీధి మండలం వలసగడ్డకు చెందిన మజ్జి గిన్ను, కోయిలంగి ధనరాజులు ఇరువురు కలసి వారి ఆటోలో 100 కేజీల గంజాయిని వయా మోతుగూడెం మీదుగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు తరలించేయత్నం చేశారు. మోతుగూడెం పోలీసులు పోలీసుస్టేషను పరిధిలో వాహన తనిఖీలు చేస్తుండగా గంజాయితోపాటు వారిద్దరు పట్టుబడ్డారు. గంజాయి తరలింపున కు పైలట్‌గా వ్యవహరించిన మజ్జి కృపానంద పరారయ్యాడు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మంనకు చెందిన కుమార్‌కు నిందితులు గంజాయి చేరవేసే ఒప్పందం కుదుర్చుకున్నట్లు తమ విచారణలో వెల్లడైందని ఏఎస్పీ తెలిపారు. ఇదిలావుండగా అస్సాంకు చెందిన ధృబజ్యోతి కోన్వార్, మణేశ్వరి నార్జారి, గోబిన్ బోనియాలు రెండు ద్విచక్ర వాహనాలపై చింతూరు మీదుగా భద్రాచలంవైపు వెళుతుండగా చింతూరు పోలీసులు పోలీసుస్టేషన్ పరిధిలో వారిని నిలువరించి వాహన తనిఖీలు చేశారు. దీంతో ద్విచక్ర వాహనాలకు చెందిన సీట్ల కింది 4 కేజీల గంజాయి బయటపడిందన్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మొత్తంమీద ఈ రెండు కేసుల్లో ఐదుగురు నిందితులను ఒక ఆటో, రెండు మోటారు సైకిళ్లు, 104 కేజీల గంజాయి స్వాధీనం చేసుకు న్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.5,20,000 ఉంటుందన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపించామన్నారు. కార్యక్ర మంలో చింతూరు సీఐ గజేంద్రకుమార్, మోతుగూడెం ఎస్ఐ గోపాలరావు సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు తెలియజేస్తున్న అల్లూరి జిల్లా చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా

మలేషియాలో కోనసీమ వాసి కష్టాలు



మట్టా రాంబాబు

ఆత్రేయపురం, ఆగస్టు 14: అప్పులు చేసి కుటుంబాన్ని ఉన్నత స్థానంలో ఉంచాలనే ఉద్దేశంతో మలేషియా వెళ్లి అక్కడ కష్టాలు పడుతున్న కోనసీమ వాసి గాథ ఇది... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లికి చెందిన మట్టా రాంబాబు కుటుంబాన్ని పోషించుకునేందుకు మూడునెలల క్రితం మలేషియా వెళ్లాడు. ఏజెంటు ద్వారా రూ.2.50 లక్షలు ఖర్చుచేసి వెళ్లిన రాంబాబు అక్కడ విశ్రాంతి లేకుండా 12 గంటలు పనిచేయించడంతో ఒత్తిడికిగురై ఎన్నో ఇబ్బందులు పడుతున్నాడు. అక్కడ ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న అతడు పనిఒత్తిడి అధికంగా ఉందని యజమానులను ప్రశ్నిస్తున్నా పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నా డు. రాంబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలను బాగా చదివించి మంచి గృహం నిర్మించాలనే ఆశతో మలేషియా వెళ్లానని... అక్కడ ఎన్నో ఇబ్బందులు పడుతున్న తనను స్వగ్రామానికి తీసుకురావాలంటూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు సోషల్‌మీడియా ద్వారా సందేశాన్ని పంపించాడు. తనను ఇండియాకు పంపించాలని యజమానిని కోరగా తిరిగి డబ్బులు కట్టి వెళ్లు అంటూ బెదిరస్తున్నాడని వాపోయాడు. తనకు ఆర్థిక స్తోమతలేదని కూటమి ప్రభుత్వం తనను రప్పించాలని కోరుతూ వాట్సాప్‌లో పెట్టిన సందేశం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఎట్టకేలకు బయటపడిన నావ

● నీట మునిగిన డ్రెడ్జింగ్ నావను వెలికితీసిన యజమాని

ధవళేశ్వరం, ఆగస్టు 14: కాటన్ బ్యారేజ్ మొదటి గేటు వద్ద నీట మునిగిన డ్రెడ్జింగ్ నావను ఎట్టకేలకు నీటి నుంచి బయటకు తీశారు. నీట మునిగిన నావను 23 రోజులుగా బయటకు తీయకపోవడంపై కలెక్టర్ పి.ప్రశాంతి ఇరిగేషన్ అధికారులకు క్లాస్ తీసుకోవడంతో అధికారుల్లో కదలికి వచ్చింది. డెల్టా సీఈ ఎన్‌పుల్లారావు, ఎస్ఈ శ్రీనివాసరావు రంగంలోకి దిగి మునిగిన నావను వెంట నే బయటకు తీయాలంటూ నావ సొంత దారుడుకి అల్టిమేటం జారీ చేయడంతో తగు విధంగా సహకరించి పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం నావలో మేటవేసిన ఒండ్రు, ఇసుకను తొలగించారు. బుధవారం ఉదయం నుంచి కప్పీలు, క్రైన్‌ల సహాయంతో ప్రయత్నించడంతో నీట మునిగిన నావ నీటి నుంచి బయటకు వచ్చింది. దీంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. బ్యారేజ్ గేట్లను ఆపరేట్‌చేసి నీటి విడుదలను నియంత్రించనున్నారు.



నీటిపై తేలియాడుతున్న డ్రెడ్జింగ్‌నావ

బిక్కవోలులో లక్ష్మీగణపతి చవితి ఉత్సవాలకు శ్రీకారం

బిక్కవోలు, ఆగస్టు 14: రాష్ట్ర వ్యాప్తంగా పేరొందిన బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో వచ్చేనెల 7న నిర్వహించే చవితి ఉత్సవాలకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన సతీమణి మహాలక్ష్మితో కలసి పందిరి రాట వేసి ఉత్సవ పనులను ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులు లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, చాగంటి సాయి బాబారెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, సింగారపు రామారావు, గుణ్ణం రమేష్, రాయుడు రామచంద్రరావు, లారీ యూనియన్ సభ్యులు, ఎఫ్‌సీఐ జట్టు కార్మికులు, ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ పాల్గొన్నారు.



బిక్కవోలులో పందిరిరాట వేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు



కొండల నడుమ సూర్యాస్తమయం

అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పోర్‌బై డ్యాంవద్ద బుధవారం కొండల నడమ సూర్యాస్తమయ సమయంలో బంగారువర్ణంతో సూర్యకిరణాలు మిరిమిట్లుగొలుపాయి. ఈ సుందర దృశ్యం ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులను ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని పర్యాటకులు సెల్‌ఫోన్లలో బంధించేందుకు ఎగబడ్డారు.

- మోతుగూడెం

ప్రియురాలికి వివాహమైందని

ప్రియుడి ఆత్మహత్య

కరప, ఆగస్టు 14: ప్రియురాలికి వివాహమైందని తెలిసి ఆమె ప్రియుడు ఆత్మహత్య చేసుకున్నట్లు కరప పోలీసులు తెలిపారు. కాకినాడ జిల్లా కరపమండలం జడ్.బావారం గ్రామానికి చెందిన పలివెల విజయ కుమార్(22) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. మూడేళ్ల క్రితం పెద్దాపురానికి చెందిన ఒక యువతి అతని ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ఇద్దరికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమకు దారితీసి పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. ఆ యువతికి 4రోజుల క్రితం వేరొక వ్యక్తితో వివాహమైనట్లు తెలిసింది. దీంతో తట్టుకోలేని విజయకుమార్ జీవితంపై విరక్తితో ఈనెల 13న గడ్డి మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు అతన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. దీనిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ తూపాటి రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి శ్రావణ మాసోత్సవాలు

అన్నవరం, ఆగస్టు 14: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వన దుర్గ ఆలయంలో గురువారం నుంచి శ్రావణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 8గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఈ వేడుకలు 19వ తేదీన జరిగే హోమ పూర్ణాహుతితో ముగుస్తాయి. జాతర మహోత్సవాలలో అమ్మవారికి విశేష అలంకరణలు, కుంకుమపూజలు జరగనున్నాయి.

రేపటి నుంచి ఫుడ్ ఫెస్టివల్

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 14: రామారావుపేటలోని జీఆర్‌టీ గ్రౌండ్‌లో ఈనెల 16 నుంచి 25 వరకు మొగల్లై ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుందని మేనేజర్ శివకిరణ్ తెలిపారు.

వరుపుల రాజా జయంతి వేడుకలు

ప్రత్తిపాడు/ఏలేశ్వరం/శంఖవరం/రౌతులపూడి, ఆగస్టు 14: దివంగత నేత, డీసీసీబీ మాజీ చైర్మన్ వరుపుల రాజా 49వ జయంతి వేడుకలు బుధవారం ప్రతిపాడులో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా హైస్కూల్ సెంటర్ వద్ద ఉన్న రాజా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన కుమారుడు సాయితర్షిత్‌తో కలిసి స్థానిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఏలేశ్వరం టీడీపీ కార్యాలయంలో కౌన్సిలర్ బొదిరెడ్డి గోపాలకృష్ణ(గోపి) ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 600 మందికి దుప్పట్లు, ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, బిస్కట్లు, పాలను ఎమ్మెల్యే, ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు అందజేశారు. భవితాకేంద్రంలో దివ్యాంగులకు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి హార్లిక్స్ డబ్బాలు, ఫ్రూటీలు, బిస్కట్లు, భోజనాలు సమకూర్చాలు. రాజా తనయుడు తర్షిత్ అధ్వర్యంలో కత్తిపూడి రిఫరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, శంఖవరం ఉన్నత పాఠశాలలో పుస్తకాలను అందజేశారు. ఎమ్మెల్యే సత్యప్రభ తనయుడు సాయి తర్షిత్ అధ్వర్యంలో మూలగపూడి, రౌతులపూడి వసతిగృహాలకు టీవీలను బహుకరించారు. రౌతులపూడి ఆసుపత్రిలో పండ్లు, పాలు, రొట్టెలు అందజేశారు.

గొల్లప్రోలు ఎస్ఐ ఆకస్మిక బదిలీ

గొల్లప్రోలు, ఆగస్టు 14: గొల్లప్రోలు ఎస్ఐ ఆకస్మికంగా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన 2నెలలు పూర్తి కాక ముందే బదిలీ చేసి కొత్త ఎస్ఐను నియమించడం, బాధ్యతలు స్వీకరించడం జరిగిపోయాయి. ప్రస్తుతం ఈ పరిణామాలు రాజకీయ, అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అప్పటి వరకూ గొల్లప్రోలు ఎస్ఐగా ఉన్న బాలాజీని జూన్ 16న ఆకస్మికంగా బదిలీ చేసి సర్పవరంలో ఎస్ఐగా పనిచేస్తున్న షేక్ జాన్‌బాషాను నియమించారు. బాలాజీని ట్రాఫిక్ పోలీసుస్టేషన్-1కు అటాచ్‌మెంట్ ఇచ్చారు. ఎస్ఐగా బా ధ్యతలు స్వీకరించి 2నెలలు పూర్తి కాకుండానే జాన్‌బాషాను బదిలీ చేశారు. ఆయన స్థానంలో గతంలో గండేపల్లి ఎస్ఐగా పనిచేసి కాకినాడ వీఆర్‌లో ఉన్న ఎస్.రామకృష్ణను నియమిస్తూ జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేయగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

'లక్ష్య సాధనకు శ్రమించాలి'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 14: సృజనాత్మకతతో ఆలోచించడం, లక్ష్యాలు నిర్దేశించుకుని ప్రణాళికతో శ్రమించినప్పుడు కోరుకున్న ఫలితాలు సాధించవచ్చని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ హెచ్‌వోడీ ఆచార్య పేటేటి ప్రేమానందం అన్నారు. బుధవారం తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో 2022-24 డిపార్టుమెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. కోర్సు కోఆర్డినేట్ డాక్టర్ కె. జోసెఫ్ స్టీఫెన్, ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ, సహాయ ఆచార్యులు డాక్టర్ నానిబాబు, డాక్టర్ కె హరిబాబు, డాక్టర్ ఎం. గోపి, జేఏ ఎం.లలిత పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో సంప్రోక్షణ

పిఠాపురం, ఆగస్టు 14: పట్టణంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం సంప్రోక్షణ వైభవంగా జరిగింది. భక్తులు, దాతల సహకారంతో ఆలయంలో గర్భగుడికి ఇత్తడి కవచం ఏర్పాటు చేయడంతో పాటు వాహన సేవలు నిమిత్తం ఇత్తడి గరుడ వాహనాన్ని తయారు చేయించారు. ఇత్తడి కవచ ద్వారానికి, గరుడ వాహనానికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సప్త కలశారాధన, కుంభ పూజ, వాస్తుహోమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు పి.విజయజనార్ధనాచార్యులు, యాజ్ఞిక బ్రహ్మ సుదర్శనం మాధవ మణికంఠాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 14: గొల్లప్రోలు మండలంలో పనిచేస్తున్న ఇద్దరు కార్యదర్శులకు పదోన్నతులు లభించాయి. దుర్గాడ పంచాయతీ కార్యదర్శి(గ్రేడ్-3)గా పనిచేస్తున్న రాజేంద్ర, ఏకేమల్లవరం పంచాయతీ కార్యదర్శి రాజులకు గ్రేడ్-2 పంచాయతీ సెక్రటరీలుగా పదోన్నతులు కల్పిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో జయప్రకాశరావు, ఈవోపీఆర్డీ కుమార్, ప్రజాప్రతినిధులు పదోన్నతి పొందిన కార్యదర్శులను సత్కరించారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా దాపర్తి

జగ్గంపేట, ఆగస్టు 14: స్థానిక కాపు కల్యాణ మండపంలో గండేపల్లి మండలం తాళ్ళూరు వేంకటేశ్వరస్వామి దేవస్థానం (జియ్యన్న) గుడి చైర్మన్‌గా దాపర్తి సీతారామయ్య, తాళ్ళూరు హైస్కూల్ చైర్మన్‌గా, జీరి సత్తిబాబు, తాళ్ళూరు మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల చైర్మన్‌లుగా మలిరెడ్డి చంద్రశేఖర్, బూర కల్యాణి, తాళ్ళూరు రామలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా సత్యనారాయణ నియమితులయ్యారు.





కాకినాడ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండబాబు, తునిలో జాతీయ జెండాతో ఎమ్మెల్యే దివ్య, పిఠాపురం మండలం కందరాడలో భారీ జాతీయ పతాకంతో ప్రదర్శన

వాడవాడలా... హర్ ఘర్ తిరంగా!

» జాతీయ పతాకాలతో ర్యాలీలు » పాల్గొన్న నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కాకినాడ సిటీ, ఆగస్టు 14: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కాకినాడ జగన్నాథపురం అన్నవరం సత్యదేవ డిగ్రీకళాశాల ఆధ్వర్యంలో విద్యార్థినులు బుధవారం నిర్వహించిన 75మీటర్ల జాతీయ జెండా ర్యాలీలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొన్నారు.

తుని రూరల్: తుని రాజా కళాశాల గ్రౌండ్‌లో హర్‌ఘర్ తిరంగా ర్యాలీని ఎమ్మెల్యే యనమల దివ్య జెండా ఊపి ప్రారంభించారు. తుని పట్టణ వీధుల్లో ర్యాలీలో విద్యార్థులతో కలిసి ఆమె నడిచారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి పాల్గొన్నారు.

పిఠాపురం: పట్టణంలో 100 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. విశాఖపట్టణం జీపీటీ ఫ్రెండ్స్ హెల్పింగ్ హేండ్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకంతో నిర్వహించిన ఈ ప్రదర్శనను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రారంభించి పాల్గొన్నారు.

పిఠాపురం రూరల్: కందరాడలో భారీ జాతీయ పతాకంతో ప్రదర్శన నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రదాన కార్యదర్శులు గండి కొండలరావు, దాట్ల సూర్యనారాయణరాజు, అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, తోట ఏడుకొండలు పాల్గొన్నారు.

కరప: పెనుగుదురులో హర్‌ఘర్ తిరంగాలో భాగంగా కరప తహశీల్దార్ పిండి గోపాలకృష్ణ అన్నదాతలతో కలిసి పంటపొలాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. జనసేన మండల అధ్యక్షుడు బండారు మురళి, కార్యదర్శి గుణ్ణం సీతారామయ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు గంటా నానిబాబు పాల్గొన్నారు. గురజనాపల్లి హైస్కూల్‌లో 78వ సంఖ్యాకృతిలో విద్యార్థులను కూర్చోబెట్టి స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటారు. హెచ్‌ఎం ఎ.సాయిమోహన్, ఎస్ఎంసీ చైర్మన్ పి.నూకరాజు, సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: వాకలపూడిలో శ్రీసిద్ధార్థ విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో 100 మీటర్ల జాతీయ పతాకంతో ప్రదర్శన చేశారు. వలసపాకలలో సన్‌రైజ్ స్కూల్ ఆధ్వర్యంలో 53 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు. ఏపీఎస్పీ స్కూల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, పార్టీ పార్లమెంటరీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు చేపట్టారు.

ఏలేశ్వరం: పట్టణంలో బీజేపీ ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు ఆధ్వర్యంలో జాతీ య జెండాలు పంపిణీ చేశారు. యర్రవరంలో సరస్వతి శిశుమందిర్,ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టారు.

తాళ్లరేవు: తాళ్లరేవు కూటమి నాయకులు, కార్యకర్తలు జాతీయపతాకాలతో బైక్‌ర్యాలీని పోలేకుర్రు పంచాయతీ జైభీమ్‌పేట నుంచి సీతారామపురం వరకు కొనసాగించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కొప్పనాతి దత్తాత్రేయవర్మ, విత్తనాల కరిమేల స్వామి, కట్టా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం: హర్ ఘర్ తిరంగా ర్యాలీ పట్టణంలో సత్తెమ్మ కాలనీ నుంచి ప్రారంభమై పలు వీధుల గుండా సాగింది. విద్యార్థులు జాతీయ జండాలతో దేశభక్తి గీతాలు ఆలపిస్తూ దర్గా సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు), టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజసూరి బాబురాజు హాజరయ్యారు. కార్యక్రమంలో విత్తనాల వెంకటరమణ, బి.రామ్‌కుమార్ తదితరులున్నారు.

సామర్లకోట: పట్టణంలో అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన భారీ జాతీయపతాక ర్యాలీ విశేషంగా అలరించింది. ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొనగా సుమారు 300 మంది విద్యార్థులు 300 అడుగుల పొడవు కలిగిన జాతీయపతాకంతో పట్టణంలో తిరిగారు. ఈ ర్యాలీని వార్డు కౌన్సిలర్ బలుసు శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు.

ప్రత్తిపాడు: రాచపల్లి, ఒమ్మంగి గ్రామాల్లో విద్యార్థులు 150 అడుగుల జాతీయ జెండాను ఊరేగించారు. భారతీ విద్యాసంస్థల అధినేత సుంకర వీరబాబు, ప్రిన్సిపాల్ రామిశెట్టి బులిరామన్న పాల్గొన్నారు.

శంఖవరం: కత్తిపూడి సీతారామ జూనియర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీహెచ్.వీరబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.అక్కా రావు,అధ్యాపకులు చక్రవర్తి, సూర్యనారాయణ ఉన్నారు.

త్రివర్ణ పతాక అలంకారంలో వేణుగోపాలస్వామి



పిఠాపురం, ఆగస్టు 14: పిఠాపురంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి త్రివర్ణ పతాక విశేష అలంకారంలో బుధవారం రాత్రి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు విజయజనార్దనాచార్యులు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ విశేష అలంకారం చేశారు.

పవన్ నివాసం వద్ద సందడి

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 14: చేబ్రోలు బైపాస్ రోడ్డులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం వద్ద స్వాతంత్ర్య దినోత్సవ సందడి నెలకొంది. బుధవారం రాత్రి జాతీయ పతాకం రంగుల్లో జెండాలతో పాటు విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం పవన్ నివాసం వద్ద ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.



పవన్ నివాసం వద్ద కట్టిన జెండాలు





కరప: పెనుగుదురులో జాతీయ జెండాలతో తహశీల్దార్,రైతులు.. శంఖవరం: కత్తిపూడిలో జెండాలతో విద్యార్థులు, పెద్దాపురం ర్యాలీలో కూటమి నేతలు

తహశీల్దార్ల బాధ్యతల స్వీకరణ

గొల్లప్రోలు, ఆగస్టు 14: గొల్లప్రోలు తహశీల్దార్ కేవీవీ సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కృష్ణా జిల్లా పామిడిముక్కల తహసీల్దారుగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. తహసీల్దారు సత్యనారాయణను కార్యాలయ సిబ్బంది కలిసి అభినందించారు.

కోటనందూరు: కోటనందూరు తహశీల్దార్‌గా టి.సుభాష్ బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పని చేసి బదిలీపై కోటనందూరు మండలం వచ్చారు.

కొత్తపల్లి: కొత్తపల్లి తహశీల్దార్‌గా జి చిన్నారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

దేశభక్తిని చాటిన 'ఆదిత్య' విద్యార్థులు

కాకినాడ రూరల్, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవవేళ ఆదిత్య విద్యార్థులు దేశభక్తిని చాటారు 1,93,426 కిలోల పునరుత్పాదక శక్తిగల పనికిరాని చెత్తను ఐటీసీ సంస్థకు అందించి కాగితాల తయారీకోసం ఉపయోగించే 3880 చెట్లను నరకకుండా వాటికి స్వేచ్ఛనిచ్చారని ఆదిత్య పాఠశాలల డైరెక్టర్ ఎస్.శృతిరెడ్డి తెలిపారు. వాతావరణం కలుషితంకాకుండా ప్రకృతి వనరులను రక్షిస్తూ ముందుకు సాగాలనే ఉద్దేశ్యంతో ఐటీసీ సంస్థ ఓవ్ అనే సామాజిక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఐటీసీ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఆదిత్య విద్యార్థులు ముందుకు రావడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన ఆదిత్య డైరెక్టర్ రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్స్, వైస్‌ప్రిన్సిపాల్స్‌ను అభినందించారు.



ఐటీసీ సంస్థకు అందించేందుకు సిద్ధం చేసిన కాగితాల బ్యాగ్‌లు

రోడ్లు పరిశీలించిన తుమ్మలపల్లి

కిర్లంపూడి, ఆగస్టు 14: మండలంలోని సోమరాయణంపేట జగనన్న కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని కాలనీ వాసులు తెలపడంతో బుధవారం జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరిశీలించారు. అన్ని రోడ్లు వేయిస్తామన్నారు. రాపేటి చిట్టిబాబు, మాదారపు చిట్టిబాబు, గోకేడ ప్రసాద్, కాయల మణికంఠ పాల్గొన్నారు.

పీజీ విద్యార్థిని అదృశ్యంపై కేసు

కాకినాడ క్రైం, ఆగస్టు 14: కాకినాడ ఆదిత్య కాలేజీలో పీజీ విద్యాభ్యాసం చేస్తున్న జోషితా సాయి(21) అదృశ్యమైనట్లు ఆమె తల్లి వానపల్లి రామలక్ష్మి ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కాకినాడ టూటౌన్ సీఐ తెలిపారు.

పీహెచ్‌సీల ఆకస్మిక తనిఖీ

ప్రత్తిపాడు, ఆగస్టు 14: మండలంలోని శాంతిఆశ్రమం, పెద్దిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సరిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ఓపీని పరిశీలించారు. ప్రస్తుతం ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల పట్ల వైద్య ఆరోగ్యసిబ్బంది తీసుకుంటున్న చర్యలు సమీక్షించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఆమె హెచ్చరించారు. కార్యక్రమాల్లో వైద్యాధికారులు,సిబ్బంది, హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

శంఖవరం: పెదమల్లాపురం, శంఖవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అడిషనల్ డీఎం హెచ్‌వో డాక్టర్ సరిత పరిశీలించి స్థానిక గిరిజన సంక్షేమశాఖ హస్టల్ విద్యార్థుల్ని కలిసి వ్యాధుల ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యులు సత్యనారాయణ, సందీప్, సౌమ్యశ్రీ ఉన్నారు.

'దారి చూపి పుణ్యం కట్టుకోండి'

కరప, ఆగస్టు 14: తన ఇంటి నుంచి బయటకు వచ్చే దారి చూపి పుణ్యం కట్టుకోవాలని ఒక మహిళ తహశీల్దార్‌కు విజ్ఞప్తి చేసింది. పెనుగుదురులో ఒక మాజీ సర్పంచ్ ఇరిగేషన్ స్థలాన్ని, పంటకాలువను, పంచాయతీ స్థలాన్ని ఆక్రమించినట్టు గ్రామస్తులు ఈనెల 5న కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుచేశారు. దీనిపై కరప తహశీల్దార్ పిండి గోపాలకృష్ణ బుధవారం పెనుగుదురులో విచారణ చేపట్టారు. స్థానిక దేవుడు కాలనీలో పాక నిర్మించుకుని నివాసముంటున్న ఒక మహిళ తహశీల్దార్‌కు ఆమె తన ఇబ్బందులపై ఏకరువు పెట్టింది.

'సేంద్రియ పద్ధతులు పాటించాలి'

తాళ్లరేవు, ఆగస్టు 14: రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించే అవకాశాలుంటాయని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. చొల్లంగిలో పొలంబడి కార్యక్రమాన్ని ఏవో ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎడీ బాబూరావు, టీడీపీ నేత మందాల గంగసూర్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

పెద్దాపురం, ఆగస్టు 14: స్థానిక జవహర్ నవోదయాలో గత 3 రోజులుగా నిర్వహిస్తున్న రీజినల్ కబడ్డీ పోటీలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో జె.సీతారామారావు విజేతలకు బహుమతులను అందజేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య, దాసరి పరశురామయ్య, సత్యనారాయణ, సుధీర్‌కుమార్, సనపల సత్యనారాయణ పాల్గొన్నారు.

కేజీబీవీలో తనిఖీలు

తుని రూరల్, ఆగస్టు 14: వి.కొత్తూరులో కేజీబీవీ పాఠశాలలో మండల లీగల్ సెల్ సభ్యులు తనిఖీలు చేపట్టారు. జిల్లా కోర్టు ఆదేశాలతో స్థానిక కోర్టు జడ్జి బాలకోటేశ్వరరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. మధ్యాహ్న భోజనంతో పాటు రికార్డులను పరిశీలించి ప్రిన్సిపాల్‌కు పలు సూచనలిచ్చారు. లీగల్ సెల్ సభ్యులు చిత్రా రాజేష్, ఎం.గణేష్, కరుణశ్రీ, ఉమ, ఎం.విజయలక్ష్మి, పెండ్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ విగ్రహావిష్కరణ

గండేపల్లి, ఆగస్టు 14: ఉప్పలపాడులో సర్పంచ్ అడబాల ఆంజనేయులు ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అడబాల కుందరాజు విగ్రహావిష్కరణ జరిగింది. టీడీపీ కార్యదర్శులు కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, కుంచే రాజా, జాస్తి వసంత్, కందుల చిట్టిబాబు, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, పోసిన బాబురావు, మరోతి శివగణేష్, వత్సవాయి బాబు, భద్రరావు పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ కాకినాడ 1వ అ॥ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
E.P. 26/2023 in O.S. 2/2021

Between
కర్రి వెంకట మధుసూదనరెడ్డి .. DHr
S/o. వెంకటరెడ్డి, వ్యాపారం, శ్రీనగర్, కాకినాడ
మరియు
మేడిశెట్టి అప్పలరాజు @ అప్పన్న .. JDr
S/o. లేటు వీర్రాజు, డోర్.నెం. 11-165, కృష్ణ టెంపుల్, వలసపాకల, కాకినాడ రూరల్

పై నెంబరు అమలు గ్రంథములో DHr కు JDr నుండి రావలసిన డిక్రీ బాకీ నిమిత్తం వసూలు చేసుకొనే నిమిత్తం ఈ క్రింది షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని **ది. 30-8-2024 సం॥ తేది ఉ.గం. 10-30 ని॥ల** నుండి పై కోర్టులో వేలం నిర్వహించెదరు వేలపు ఖర్మీయార్లులోని షరతులకు లోబడి వేలం జరుగును. సదరు వేలంలో పాల్గొన దలచినవారు ఈ క్రింది DHr తరపు ప్లీడరు గార్ని గానీ, కోర్టువారి యొక్క 'నాజరు' వారి ఆఫీసులో గాని సంప్రదించవలెను.

షెడ్యూలు

East Godavari District, Kakinada Rural Mandal, Panduru Village, S.No.14/1, an extent of Ac 1.00 cents in total extents of in A.C.3.70 cents and situated within the following boundaries and Measurements

East: Panta Kaluva, **West** : Punta; **South:** Land of Medisetti Chandra Rao, **North:** Land of Subb Rao, within the above boundaries and measurments of an extent of Ac1-00 cents with ordinary ways, all water ways, and all easementary rights exclusive

DHr Value : Rs.18,00,000/-
Amin Value : Rs. 20,00,000/-
JDr Value : Not Given

K. Lakshmi Narayana, Advocate
Kakinada Ramaraopeta, Kakinada
Dt. 14-8-2024 Cell No. 95505 46466